بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 06 Nov 2026 (Telugu)

# తహ్రీకె జదీద్ 92వ సంవత్సరంలో సమర్పించబడిన ఆర్థిక త్యాగాల ప్రస్తావన

# 93వ వార్షిక ప్రారంభ ప్రకటన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 06.11.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టీల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్'లో ఇలా ఉపదేశిస్తున్నాడు: لَنۡ تَنَالُوا الۡبِرَّ حَتّٰی تُنۡفِقُوۡا مِمَّا تُحِبُّوۡنَ అనగా మీకు అత్యంత ప్రీతి కరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించ నంత వరకు పరిపూర్ణముగా ధార్మికులు గాలేరు.

ఒక హదీసులో ఇలా ఉంది: ఈ సూక్తి అవతరించినప్పుడు, హజ్రత్ తల్హా రజి అల్లాహు అన్హు తన అత్యంత ప్రియమైన, విలువైన బీ'రుహా అనే తోటను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి సేవలో సమర్పిస్తూ, ఇదే నా అత్యంత ప్రియమైన ఆస్తి అని విన్నవించుకున్నారు. ఇది కాకుండా, ఎప్పుడు ఆర్థిక త్యాగానికి పిలుపు వచ్చినా చాలామంది అనుచరులు (రజి.) ముందంజలో ఉండి తమ ధనాన్ని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమక్షంలో సమర్పించే వారని ఇతర హదీసుల ద్వారా కూడా తెలుస్తుంది. ఈ ప్రకాశించే నక్షత్రాల వంటి అనుచరులు నేటికీ మనకు మార్గదర్శకులు.

తరువాత అల్లాహ్ తఆలా చేసిన వాగ్దానాల ప్రకారం ఇస్లాం పునరుజ్జీవన యుగం వచ్చినప్పుడు, ఈ కాలంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చేసిన పిలుపులపై వారి అనుచరులు (రజి.) కూడా త్యాగాలు చేశారు; ఎందుకంటే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులకు ఆ త్యాగాల ప్రాముఖ్యత మరియు అంతరార్థాన్ని తెలియజేశారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇలా ఉపదేశిస్తున్నారు: పనికిరాని, వ్యర్థమైన వస్తువులను ఖర్చు చేయడం ద్వారా ఏ మనిషీ పుణ్యం చేశానని చెప్పుకోలేడు. సత్కార్యాల ప్రవేశద్వారం చాలా ఇరుకైనది. కావున పనికిరాని వస్తువులను ఖర్చు చేయడం ద్వారా ఎవరూ అందులోకి ప్రవేశించలేరనే విషయాన్ని బాగా గుర్తుంచుకోండి. ఎందుకంటే لَنۡ تَنَالُوا الۡبِرَّ حَتّٰی تُنۡفِقُوۡا مِمَّا تُحِبُّوۡنَ 'లన్ తనాలుల్ బిర్ర హత్తా తున్ఫిఖూ మిమ్మా తుహిబ్బున్' (మీకు అత్యంత ప్రీతి కరమైన దానిని మీరు ధర్మ మార్గమున వినియోగించ నంత వరకు పరిపూర్ణముగా ధార్మికులు గాలేరు.) అని పవిత్ర ఖుర్‌ఆన్ స్పష్టంగా ఆజ్ఞాపిస్తోంది. మీరు మీ అత్యంత ప్రియమైన, అమూల్యమైన వస్తువులను ఖర్చు చేయనంత వరకు, మీరు దైవ ప్రేమకు మరియు ప్రియత్వానికి పాత్రులయ్యే ఆ ఉన్నత హోదాను పొందలేరు. ఒకవేళ మీరు కష్టాలను భరించడానికి ఇష్టపడకపోతే, నిజమైన సత్కార్య మార్గాన్ని అనుసరించకపోతే, ఇక విజయాన్ని, సార్థకతను ఎలా సాధించగలరు? అనుచరులు (రజి.) తాము చేరుకున్న ఆ ఉన్నత స్థానాన్ని ఏ కష్టమూ లేకుండా ఉచితంగానే పొందేశారా?... అసలు విషయం ఏమిటంటే, తాత్కాలిక కష్టాలను ఓర్చుకోనంత వరకు, నిజమైన ఆనందానికి మూలమైన అల్లాహ్ తఆలా ప్రీతిని ఎప్పటికీ

పొందలేము.

ఇది హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జమాఅత్‌లో పెంపొందించడానికి ప్రయత్నించిన స్ఫూర్తి. ఆయన అనుచరులు (రజి.) కూడా త్యాగాలలో ఎంతగానో ముందంజ వేశారు, దాంతో ఆయన అలైహిస్సలాం స్వయంగా ఇలా పేర్కొనవలసి వచ్చింది: మా జమాఅత్‌లో చేరిన కొందరి ఒంటిపై సరైన దుస్తులు కూడా ఉండవు, ఒక దుప్పటి లేదా పైజామా కూడా ఎంతో కష్టమ్మీద లభిస్తుంది; కానీ వారి నిష్కల్మషత్వం, విధేయత, భక్తి, ప్రేమాభిమానాలను చూసినప్పుడు మనసు ఆశ్చర్యచకితమవుతుంది. ఆయన అలైహిస్సలాం సమాజంలో తీసుకొచ్చిన ఆ ఆధ్యాత్మిక పరివర్తనకు మరే ఇతర ఉదాహరణా కనిపించదు.

నేడు త్యాగస్ఫూర్తిని ఒక అహ్మదీ గ్రహించినంతగా మరెవరూ గ్రహించలేరు. ప్రస్తుత కాలంలో మనకు జమాఅత్‌లో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తాయి. వారిలో అనేకులు ఎన్నడూ వర్తమాన ఖలీఫాను ప్రత్యక్షంగా చూడనే లేదు; కేవలం ఎంటీఏ (మీఆ) లో ముఖచిత్రం చూశారు లేదా స్వరం విన్నారు, అయినా సరే వారు నిష్కల్మషత్వం మరియు విశ్వాసంలో నిరంతరం ముందుకు సాగుతూనే ఉన్నారు. ప్రాపంచికంగా ప్రజలకు వీరి గురించి పెద్దగా తెలియదు, పైకి వీరు తక్కువ విద్యావంతులుగా కనిపించవచ్చు, కానీ వీరు పవిత్ర ఖుర్‌ఆన్ బోధనల అంతరార్థాన్ని లోతుగా గ్రహించి, వాటిని తమ జీవితాల్లో ఆచరించడానికి నిరంతరం ప్రయత్నిస్తారు.

దీనికి ఒక ఉదాహరణ గ్వాడలోప్ (+ఋఎవశ్రీశీబజూవ) దేశానికి చెందిన ఒక నవ అహ్మదీది. ఆయన ఇటీవల యూకే జల్సా సాలానాలో కూడా పాల్గొని నన్ను కలిశారు. జమాఅత్ ఏ విధంగా పనిచేస్తుందో ఆయన ఇక్కడ చూశారు. జమాఅత్‌కు ఒక ఆర్థిక వ్యవస్థ ఉందని, ప్రజలు ఈ విధంగా చందాలు సమర్పిస్తారని, దాని ద్వారా ఇస్లాం వ్యాప్తి కోసం ఎటువంటి పనులు జరుగుతున్నాయో ఆయనకు వివరించడం జరిగింది. ఈ త్యాగాల వ్యయం (డబ్బు వినియోగించే విధానం) గురించి చెప్పినప్పుడు ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ, జమాఅత్ ఈ ధనాన్ని అల్లాహ్ తఆలా మార్గంలో ఏ విధంగా ఖర్చు చేస్తుందో నేను జల్సా సాలానాలో స్వయంగా నా కళ్ళతో చూశానని అన్నారు. మిషనరీ గారు రాస్తూ, ఈ సంఘటనలో మరొక విశ్వాసాన్ని పెంచే అంశం ఏమిటంటే: తహ్రీకె జదీద్ చందా చివరి రోజున ఆయన నా వద్దకు వచ్చి, నాకు ఆరేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇది అతని తరఫున ఆరు యూరోల చందా అని చెప్పారు. ఆయన ఇంకా వివరిస్తూ, జమాఅత్ ఏ విధంగా త్యాగాలు చేస్తుందో నేను నా కుమారుడికి చెబుతూ ఉండేవాడిని. ఒకరోజు నేను అతడిని పార్కుకు తీసుకెళ్లి ఊయల టిక్కెట్లు తీసుకోబోతుండగా, వాడు నేను ఈరోజు ఊయల ఎక్కను, బదులుగా ఈ డబ్బులను నా తరఫున అల్లాహ్ మార్గంలో ఇచ్చేయండని చెప్పాడని అన్నారు. పైకి ఇది చాలా స్వల్పమైన డబ్బుగా కనిపించవచ్చు, కానీ ఆ చిన్న బాలుడి తరఫున ఇది ఎంతో గొప్ప త్యాగం.

గిని కొనాక్రికి చెందిన ఒక సంఘటన ఇట్లుంది: తౌలా గారు అనే ఒక అహ్మదీ ఉన్నారు, ఆయన ఎంతో పేదవారు. ఆయన తన తెహ్రీకె జదీద్ చందాగా ముప్పై వేల ఫ్రాంకులు రాయించారు. ఆయన ఇలా చెబుతున్నారు: నా కుమార్తె వివాహం కూడా నిశ్చయమై ఉంది. అందుకోసం నేను కొంత డబ్బును కూడబెట్టాను. ఇంతలోనే ముఅల్లిమ్ గారు చందా వసూలు చేయడానికి వచ్చారు. నా కుమార్తె పెళ్లి కోసం కూడబెట్టిన ఆ సొమ్మును, చందాలో జమ చేసుకోమని వారికి ఇచ్చేశాను. దాని తర్వాత అల్లాహ్ తఆలా నాపై ఎంతటి అనుగ్రహం చూపించాడంటే నా ఒక కుమారుడు చాలా కాలం క్రితం ఫ్రాన్స్ వెళ్ళడానికి ఇంటి నుండి బయలుదేరాడు, ఆ తర్వాత అతని ఆచూకీ ఏమీ తెలియరాలేదు; ఎంత సమయం గడిచిపోయిందంటే, దేవుడు చేయకూడదు కానీ వాడు దారిలోనే ఎక్కడో మరణించి ఉంటాడని మేము భావించాము. అలాంటిది అకస్మాత్తుగా ఒకరోజు అతని నుండి ఫోన్ కాల్ వచ్చింది. తాను క్షేమంగా ఫ్రాన్స్ చేరుకున్నానని చెప్పాడు. అంతేకాకుండా మీ ఖర్చుల నిమిత్తం నేను ఒక భారీ డబ్బును మీకు పంపిస్తున్నానని కూడా తెలిపాడు. ఆయన ఇంకా ఇలా అంటున్నారు: ఈ సంఘటన నా విశ్వాసాన్ని ఎంతగానో

పెంచింది. చందా సమర్పించడం వల్ల ఒకవైపు నా కుమారుడి జాడ తెలిసింది, మరోవైపు అల్లాహ్ తఆలా అంతకు ఎన్నో రెట్లు ఎక్కువగా ఆ ధనాన్ని నాకు తిరిగి ప్రసాదించాడు.

అర్జెంటీనా మురబ్బీ గారు ఇలా రాస్తున్నారు: అర్జెంటీనా దేశపు మొట్టమొదటి స్థానిక అహ్మదీ అయిన నాసిర్ అర్మోనస్ గారు అనే ఒక నిష్కల్మషమైన అహ్మదీ ఉన్నారు. ఆయన ఆ దేశంలో ప్రముఖ పాత్రికేయుడిగా ఉండేవారు, కానీ కొన్ని సంవత్సరాలుగా దివ్యాంగుడయ్యారు (వైకల్యానికి గురయ్యారు). వారి కుటుంబం నిరంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది; ఎంతలా అంటే, కొన్నిసార్లు మందులు కొనడానికి కూడా వారి వద్ద డబ్బులు ఉండవు. మురబ్బీ గారు చెబుతూ: మీ పరిస్థితి చందా ఇచ్చేలా లేదు, కానీ శుభం కొరకు ఏమైనా ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చు అని నేను వారితో చెప్పాను. ఈ మాట విన్న తర్వాత, ఆయన కొద్ది రోజులకే స్వయంగా సంప్రదించి, నేను జమాఅత్ బ్యాంకు ఖాతాలోకి చందా మొత్తం జమ చేశానని తెలిపారు. పరిశీలించి చూడగా, ఆయన ఇరవై ఐదు డాలర్ల మొత్తాన్ని పంపించారు. ప్రాపంచికంగా ఇది చిన్న మొత్తమే కావచ్చు, కానీ ఆయన వ్యక్తిగత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుంటే ఇది ఎంతో అసాధారణమైన త్యాగం.

బెనిన్ దేశానికి చెందిన ఒక సంఘటన ఇట్లుంది: క్రైస్తవ మతం నుండి అహ్మదియ్యత్‌ను స్వీకరించిన ఒక నవ అహ్మదీ ఉన్నారు, ఆయనకు ఒక చిన్న దుకాణం ఉంది. ఆయన ఇలా చెబుతున్నారు: నా వద్ద పది వేల ఫ్రాంకుల డబ్బు మాత్రమే ఉంది. ఇంతలోనే నా కుమార్తె నా వద్దకు వచ్చి, ఫీజు చెల్లించలేదని పాఠశాల యాజమాన్యం తనను పాఠశాల నుండి పంపించేసిందని చెప్పింది. నేను ఆ స్కూల్ ఫీజు కట్టడానికి సిద్ధమవుతున్నాను. సరిగ్గా అదే సమయంలో ముఅల్లిమ్ గారు తెహ్రీకె జదీద్ చందా నిమిత్తం వచ్చారు. దాంతో నా వద్ద ఉన్న ఆ డబ్బును చందాగా ఇచ్చేశాను. ఆ తర్వాత అల్లాహ్ తఆలా నాపై ఎంతగానో అనుగ్రహం చూపించాడు; ఆ రోజే నా దుకాణానికి విపరీతంగా కస్టమర్లు వచ్చి నందున ఏకంగా రెండు లక్షల ఫ్రాంకుల విలువైన సరుకు అమ్ముడుపోయింది మరియు భారీ లాభం సమకూరింది. ఫలితంగా, నేను అదే రోజు నా కుమార్తె స్కూల్ ఫీజును కూడా చెల్లించగలిగాను.

చాలా మంది ప్రజలు తమ సంఘటనలను రాస్తూ ఉంటారు: మేము ఆర్థిక త్యాగాలు చేస్తూ, ప్రార్థనలు చేసుకుంటాము; అలాగే ప్రార్థనల కొరకు హుజూర్ గారికి కూడా లేఖలు రాస్తూ ఉంటాము. ఈ త్యాగాల పుణ్యమా అని నిలిచిపోయిన, చెడిపోయిన పనులు చక్కబడతాయి, పిల్లల ప్రవర్తనలో సత్సంస్కరణలు చోటుచేసుకుంటాయి. కెనడా నుండి నేషనల్ సెక్రటరీ తెహ్రీకె జదీద్ లజ్నా ఇమాఇల్లాహ్ ఇలా రాస్తున్నారు: ఒక లజ్నా సభ్యురాలు తన పేరు బహిర్గతం చేయకుండా ఈ విషయాన్ని తెలిపారు నేను ఎల్లప్పుడూ నా స్థోమతకు తగినట్లుగానే చందా చెల్లిస్తూ ఉండేదానిని. గత సంవత్సరం హుజూర్ ఇచ్చిన ఖుత్బాలో, హజ్రత్ అమ్మాన్ జాన్ (రజి.) గారి ఆదర్శాన్ని ప్రస్తావిస్తూ, ఆమె సంవత్సర ప్రారంభంలోనే తన వాగ్దానాన్ని రాయించి, వెంటనే దాన్ని నెరవేర్చేవారని సెలవిచ్చారు. ఆ విషయాన్ని విని, నేను కూడా దీనిని ఆచరించాలని సంకల్పించి నా వాగ్దానాన్ని రాయించి, వెంటనే చెల్లించేశాను; ఆ మొత్తం నా రెండు నెలల జీతంతో సమానం. ఆ తర్వాత అల్లాహ్ శుభాలను నేను స్వయంగా కనులారా చూశాను; ఏదో దాగి ఉన్న గుప్తనిధి లభించినట్లు అనిపించింది. ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన పనులు పూర్తయ్యాయి. ఒక ఇల్లు చాలా మంచి ధరకు అమ్ముడైంది, అంతేకాకుండా వేరొక చోట కొత్త ఇంటిని కొనుగోలు చేసే సౌభాగ్యం కూడా లభించింది.

రష్యా ముబల్లిగ్ ఇన్‌చార్జ్ గారు ఇలా రాస్తున్నారు: ఒక నిష్కల్మషమైన, త్యాగశీలి అయిన అహ్మదీ ఉన్నారు. ఒకరోజు జుమా నమాజ్ తర్వాత ఆయన నాకు ఒక గణనీయమైన మొత్తాన్ని ఇచ్చారు. మీ చందా బాకీలేవీ లేవు కదా అని నేను అన్నాను. దానికి ఆయన సమాధానమిస్తూ: నేను నా స్వదేశానికి వెళ్లి తిరిగి మాస్కోకు వచ్చినప్పుడు, విమానాశ్రయంలో ఇతర దేశాల ప్రయాణికులతో పాటు నన్ను కూడా నిలిపివేశారు. గతంలో కూడా ఇమ్మిగ్రేషన్ అధికారులు చాలా చిన్న విషయాలకే ప్రయాణికులను ఆపి వెనక్కి తిప్పి పంపించేసేవారు. ఆ సమయంలో, దేవుని

మార్గంలో ఖర్చు చేయడం వల్ల ఎల్లప్పుడూ పనులు నెరవేరాయన్న విషయం నా మదిలోకి వచ్చింది. ఒకవేళ నన్ను వెనక్కి తిప్పి పంపించకుండా అనుమతిస్తే, నా స్వదేశానికి వెళ్లడానికి అయ్యే విమాన టికెట్ ఖర్చుతో సమానమైన డబ్బును అల్లాహ్ తఆలా మార్గంలో సమర్పిస్తానని మనసులోనే మొక్కుకున్నాను. చివరకు అధికారులు నన్ను విడిచిపెట్టారు, అనుమతించారు. కాబట్టి నేను చేసుకున్న ఆ వాగ్దానానికి అనుగుణంగానే ఈ మొత్తాన్ని సమర్పిస్తున్నానని తెలిపారు.

అల్లాహ్ తఆలా అనుగ్రహం వల్ల అక్టోబర్ 31తో తెహ్రీకె జదీద్ 92వ సంవత్సరం ముగిసింది. ఇప్పుడు నవంబర్ 1వ తేదీ నుండి 93వ సంవత్సరం ప్రారంభమైంది. గడచిన ఈ సంవత్సరంలో జమాఅత్ తెహ్రీకె జదీద్ విభాగంలో 20.28 మిలియన్ల (పౌండ్ల) త్యాగాన్ని సమర్పించే సౌభాగ్యాన్ని పొందింది. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 7 లక్షల 27 వేల పౌండ్లు ఎక్కువ. చందాదారుల సంఖ్యలో కూడా గత ఏడాదితో పోల్చితే 46,616 మంది పెరుగుదల నమోదైంది.

ఆ తర్వాత హుజూరె అన్వర్ మొత్తం వసూళ్ల పరంగా మొదటి పది స్థానాల్లో నిలిచిన దేశాల జమాఅత్‌ల స్థానాలను ప్రస్తావించారు. అందులో బ్రిటన్ ప్రథమ స్థానంలో, జర్మనీ ద్వితీయ, అమెరికా తృతీయ, కెనడా నాలుగవ, మిడిల్ ఈస్ట్ ఐదవ, భారత దేశం ఆరవ, ఆస్ట్రేలియా ఏడవ, ఇండోనేషియా ఎనిమిదవ, ఘానా తొమ్మిదవ, మరొక మిడిల్ ఈస్ట్ పదవ స్థానాల్లో నిలిచినవి. అనంతరం భారతదేశంలోని పది రాష్ట్రాల స్థానాలను పేర్కొంటూ, కేరళ రాష్ట్రం మొదటి స్థానంలో అనంతరం తమిళనాడు, తెలంగాణ, ఒడిషా, కర్ణాటక, జమ్ము మరియు కాశ్మీర్, పంజాబ్, బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ స్థానాలను పొందినవి. ఆపై క్రమపద్ధతిలో మొదటి పది స్థానిక జమాఅత్‌ల స్థానాలను ప్రకటిస్తూ: హైదరాబాద్ మొదటి స్థానంలో ఆ తర్వాత కోయంబత్తూరు (తమిళనాడు), మూడవ స్థానంలో ఖాదియాన్, అనంతరం కాలికట్, మేలపాళయం, బెంగళూరు, కేరంగ్, కరులాయి, కలకత్తా మరియు కన్నూర్ టౌన్ నిలిచాయని ప్రకటించారు.

హుజూరె అన్వర్ ఇలా ప్రవచించారు: తెహ్రీకె జదీద్ చందాల ద్వారా ఆఫ్రికాలోని 7,601 మసీదులు, 2,400 మిషన్ హౌస్‌లు మరియు ముబల్లిగీన్లు, ముఅల్లిమీన్ల ఖర్చులు భరించబడుతున్నాయి. నుస్రత్ జహాన్ స్కీమ్ కింద 13 దేశాలలో 620 పాఠశాలలు మరియు 14 దేశాలలో 41 ఆసుపత్రులు, క్లినిక్‌లు సేవలందిస్తున్నాయి. ఇది కాకుండా విశ్వవిద్యాలయాలు, ఉపకారవేతనాలు, 26 రేడియో స్టేషన్లు, ఎంటీఏ (మీఁా) స్టూడియోలు మరియు ప్రపంచంలోని వివిధ దేశాలలో తబ్లీగ్ (ధర్మ ప్రచారం), విద్యా ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించబడుతోంది. ఈ మహోన్నత సేవలన్నీ జమాఅత్ సభ్యుల నిష్కల్మషమైన ఆర్థిక త్యాగాల ద్వారానే కొనసాగుతున్నాయి. వారి పరిమిత వనరుల నుండే ఈ అసాధారణ ఫలితాలు సాధించబడుతున్నాయి.

తెహ్రీకె జదీద్ మరియు ఇతర కేంద్ర చందాల ద్వారా జమాఅత్ ఖర్చులు పూర్తవుతున్నాయి, ఇది సభ్యుల హృదయపూర్వక త్యాగాలు, అల్లాహ్ తఆలా అనుగ్రహం వల్లే సాధ్యమవుతోంది. అల్లాహ్ తఆలా త్యాగం చేసిన వారందరి సంపదలలో, కుటుంబాలలో శుభం ప్రసాదించుగాక, వారికి ఉత్తమమైన ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక.ఆమీన్.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔